

# పేర్వార గర్వం

## శ్రీవిరించి

టైం ఎంతో కాలేదు ఎదిగంటలు నిజానికి యిలాంటి నగరాలలో పగలు రాత్రి బేదం లేకుండా ఎప్పుడూ హోటళ్ళు తెరిచి వుంచినా తప్పులేదు కాని ఎండా తొమ్మిది అయినా కాకుండానే యిక్కడి కాపీ హొటన హోటళ్ళు సప్లయి పూర్తి చేసి రికామీగా నంతా కడిగి ఎల్లలు కుర్చీలు మేరు పర్వతాలల గ ఒకదాని కొకటి పేర్చి షట్టర్స్ క్లోజ్ చేసేస్తారు

సినిమాకు వెడుతున్నప్పుడు అనిపించలేదు యిలాంటి యిక్కట్టు వస్తుందని తీరా యిప్పుడు కడుపులో ఎలుకలు పరుగెత్తుతున్నప్పుడు పశ్చాత్తాపం కలుగుతోంది

సినిమా హాలునుంచి మకాం చేస్తున్న గదికి వెళ్లేదారిలో అయిదారు హోటళ్ళు వున్నాయి ఎక్కడో అక్కడ కతికి గదికి వెడితే మళ్లీ తెల్లవారేంతవరకు యిబ్బంది వుండేదికాదు కాని యిపన్నీ మూసి వేస్తారనే సంగతి గమనం లేకుండా పోయింది

పది పన్నెండేళ్ళు యీ వూళ్లో కాపురం వెలగబెట్టిన వాడే కాకపోతే నాలుగేళ్ళుగా యిక్కడ వుండకుండా మరో రాష్ట్రానికి బదిలీ అయి వెళ్లిపోయినాడు ఇప్పుడేదో కంపెనీ పనిమీద రావలసి వచ్చింది కంపెనీ వాళ్ళు యిచ్చే టి ఏ డి ఏ మిగుల్చుకోవడం కుటుంబ అవసరాలకు చాల అవసరం గనుక ఓ బ్రహ్మచారి స్నేహితుడి గదిలో మకాం వేశాడు కష్టాలన్నీ వంటరిగా రావన్నట్లు తను వచ్చిన మరుసటి రోజే ఆ స్నేహితుడు స్వగ్రామానికి వెళ్లిపోవలసిన అత్యవసర పరిస్థితి యేర్పడింది గదంతా తన మీద వదిలి రెండు మూడు రోజుల్లో తప్పనిసరిగా తిరిగి వస్తాననీ అంతగా రాకపోయినా యీలోపలే వెళ్లిపోవలసి వస్తే తాళంచెవి యింటివాళ్లకు అప్పజెప్పితే చాలని తనకు యేమీ యిబ్బంది అవదనీ – యిట్లా ఊళ్లో లేకుండా వెళ్లవలసి వచ్చినందుకు చాల సిగ్గుగా వున్నదనీ ఆ స్నేహితుడు మరీ మరీ మోషపెట్టాడు వెళ్లేముందు

సాయంత్రం ఆపీసుపని కావడంతోటే అలా కులాసాగా రోడ్ను వార నడుస్తూ వుంటే సినిమా హాలు కనిపించింది హాలు ముందు ప్రదర్శనకోసం పెట్టిన ఫూల్‌సైజ్ లేక లైఫ్‌సైజ్ హీరో హీరోయిన్ల బొమ్మలు తప్పనిసరిగా లోపలకు రమ్మని ప్రాదేయ పడుతూ వున్నట్లు అనిపించింది ఈ బాషా చిత్రం చూచి అయిదారేళ్ళు అయిపోయింది గదా – అని మొహమాటపడి హాల్లో జొరబడ్డాడు

తీరా ఎయటపడిన తరువాత యిదీ సందర్భం

ఒక సర్కిల్లో రోడ్డు వారగా చిన్న చిన్న బడ్డీకొట్లు పది పదిహేనుదాకా కనిపించాయి వేడివేడిగా యిడ్లీ మసాల దోసె గారలాంటి వస్తువులు అమ్ముతున్నారు ఈ కొట్ల చుట్టూ మూగి అనేకమంది వాటిని ఆరగిస్తున్నారు కూడాను దుకాణాల పక్కనే మురుగు కాలువ – యీ దుకాణాలు కడిగి పారబోసే నీళ్ళు రోడ్డు నాలుకలు తెరుచుకుని జాపుకుని నాకో ముక్క పడవేయమని అడుగుతున్న జాగిలాలు – లైట్లకోసం పోగయిన పురుగులు వగయిరా భోజన పదార్థాల మీద కూడా విచ్చలవిడిగా విహారం చేయడం యిదంతా చూస్తూ వుంటే అక్కడ తిన బుద్ధి కాక పోవడమే గాక వాంతి వచ్చినంత పని అయింది కార్లు రిక్షాలు ఆపుకుని పెద్ద పెద ఆసాములు యిక్కడ యెలా బోజనం చేస్తున్నారబ్బా అని విచారం సంతాపం కలిగినాయి

ఆకలిని చంపుకుందుకు యేదో రకమయిన

పదార్థం కడుపులోనికి పంపడంలో యేమాత్రం విశ్వాసం లేదు నథింగ్ ఈజ్ బెటర్ దాన్ నాన్సెన్స్ అన్న సిద్ధాంతానికి చెందిన మనిషి

ఇలా జరుగుతుందని ముందుగానే గుర్తు వచ్చినట్లయితే సినిమాకు వెళ్లేముందే – అబ్బే బొత్తిగా ఆ సమయంలో తినడం అలవాటు లేదు – పోనీ యే మోడరన్ బ్రెడ్‌లాంటిదో ఒకటి కొనుక్కుని బ్రీఫ్‌కేస్‌లో దాచుకున్నా సరిపోయేది

స్నేహితుడు కూడా బద్ధకంలో తక్కువ వాడేమీ కాదు ఇంటిదగ్గర కనీసం టీ చేసుకుందు కయినా సరంజామా లేదు ఎం కావలసినా నాలుగు అడుగులు వేస్తే బోలెడన్ని దుకాణాలు 'బయట పుష్కలంగా పాలు దొరుకుతూ వుంటే యింట్లో ఆవును కట్టేసుకోవడం యెందుకు – అని కాబోలు!

మోడరన్ బ్రెడ్ అంటే గుర్తు వచ్చింది ఈ ప్రాంతాలలో రొట్టె అంగళ్లు యెక్కువ తన పుణ్యం పుచ్చి యేమూలో ఒక అంగడి కునికిపాట్లు పడుతూ వుంటే కనీసం బ్రెడ్ బన్‌లాంటి వయినా కొనుక్కోవచ్చును దీనికోసం యెక్కువ సమయం వెదకులాడుతూ తిరగడం యిష్టంలేదు కాని కడుపులో దహించుకుపోతున్న ఆకలి – మనసును చికాకు పరుస్తోంది

బడ్డీ దుకాణాల వెనకాల సందులో నాలుగయిదు రొట్టె దుకాణాలు వున్నాయి తాజా సరుకు దొరుకుతుంది అందులో యేం అనుమానం లేదు – దుకాణం అంటూ తెరిచి వుండాలిగాని

శ్రమ వృదా కాలేదు

మినుకు మినుకు మంటున్న నలబయివాట్ల కరెంటు దీపం అల్లంత దూరంనుంచే కనిపించి అడుగులు కాస్త చురుగ్గా వేసేట్లు చేసింది అక్కడకు చేరుకుందుకు ముందే అంగడి కట్టివేస్తారేమోనని బయం – అంతకన్నా యింకేం లేదు

దుకాణం చేరుకున్నాడు

ఎవరో ఆడ మనిషి వుంది అంగట్లో దుకాణాలకు వెనకాలే యిళ్లూ వాకిళ్లూ వుంటాయి అంచేత యింట్లో మనుషులంతా యెవరికి వీలయినప్పుడు వాళ్లూ బేరసారాలు చూస్తూనే వుంటారు

బ్రెడ్ దొరుకుతుందా?

బొత్తిగా అలౌకికమయిన ప్రశ్న రొట్టె అంగడిలో బ్రెడ్ కాక యింకేం దొరుకుతుంది? బ్రెడ్ ఒకటి యివ్వండి అంటే బాగుండేది విన్న మనిషి కయినా అందంగా వుండేది – అనిపించింది

ఆమె బ్రెడ్ తీసి స్లయిస్ రాసి మళ్లీ ప్యాక్ చేసి అందించింది యేం మాట్లాడకుండా

దుకాణం అంతా కలయ చూస్తున్నాడు యింకేమయినా తినడానికి దొరుకుతాయో అని ఆబగా

సీసాల నిండా రకరకాల బిస్కట్లు కారపు పదార్థాలు వున్నాయి కారం తన వంటికి పడదు బిస్కట్లు యేమూలకూ రావు రొట్టె వుంటే యింకేం కావాలి గనుక!

జామ్ వుందా?

విడిగా దొరకదు సీసా తీసుకోవాలి మేం యింట్లో తయారు చేసిన జాం పైనుంచి వచ్చిన సరుకు కాదు – అంటూ ఒక సీసా అందించింది

అవి మాటలుగా అనిపించలేదు సంగీత తరంగాల లాగ చెవులను తగిలాయి

సీసా అందుకుంటూ ఎంత యివ్వాలి? అన్నాడు ఆమె చెప్పింది జేబులో నుంచి పర్స్ తీసి కాగితాలు యెంచి చిల్లర సేకరించి మళ్లీ యెలాంటి విపర్యమూ రాకుండా – ఆమె ముందు వుంచాడు

ఆమె డబ్బు అందుకోలేదు

ఆదేం? అన్నట్లుగా ఆమె వంక చూచాడు తన వంకే చాల సేపటి నుంచి చూస్తూ వున్నదనీ అందుచేతనే డబ్బు అందుకోలేదనీ అర్థం అయింది

ఆమె వంకే దీక్షగా చూచాడు

శాంతమూర్తి కదూ? అంది ఆమె

కళవెళ పడ్డాడు పేరు ఆమెకెలా తెలిసింది? తెలిసిన మనిషా?

మా గుర్తు పట్టలేదా? మరచిపోయినా వన్నమాట పోనీలే కులాసాగా వున్నావా? అంది ఆమె నిర్లిప్తంగా

క్షమించండి క్ష

సరే రొట్టె తీసుకు వెళ్లు అంది ఆమె

ఎవరో చెప్పరూ మీరు?

ఆమె నీరసంగా నవ్వింది పెదిమలు వంకర తిరిగాయి జవాబు చెప్పలేదు

మెదడు బరుక్కున్నాడు లోపల దీపం వెలిగినట్లయింది

క్షమించండి కౌసల్యాదేవిగారా? వెంటనే గుర్తు పట్టలేకపోయినాను బాగున్నారా?

అవును కౌసల్యాదేవిగారో! అంది ఆమె కోపంగా

వణికి పోయినాడు

అక్కడే బల్ల మీద కూలబడ్డాడు అంతసరకూ వున్న – అల్లరి చేస్తున్న ఆకలి యేమయిపోయిందో యిప్పుడు కొత్తగా పిరికితనం పట్టుకుంది మనసును

పాపం ఆకలిగా వున్నావేమో యిందు రొట్టె తిను ఉండు ప్లేట్ పట్టుకు వస్తాను ఆమె లోపలకు వెళ్లి ఒక సాసర్ నీళ్ల గ్లాసు తీసుకు వచ్చింది చేతిలో రొట్టె లాక్కుని నాలుగు స్లయిస్‌కు దుకాణంలోని వెన్న జాం రాసి ముందు వుంచింది తిను అంది

శాంతమూర్తి ఆత్రంగా తిన్నాడు

ఆమె యీ లోపల మరో నాలుగు స్లయిస్ తయారు చేసింది అవీ గుటికాయ స్వాహా చేశాడు

చాల్లే యింక ఇంటికి వెళ్లి పడుకో ఎక్కువ తింటే అజీర్తి చేస్తుంది రేపు బ్రేక్‌ఫాస్ట్‌గా తీసుకో మిగిలిన రొట్టె అని పాక్ చేసి మళ్లీ అతనికి అందించింది


దాన్ని బ్రీఫ్‌కేస్‌లో దాచుకున్నాడు కౌసల్యా బాగున్నావా? అన్నాడు అమ్మయ్య ఇప్పటికయినా మామూలు మనిషివి అయ్యావు పోనీలే కౌసల్యా దేవిగారు కాస్తా కౌసల్య అయింది ఇంకా తటపటాయిస్తే యేమేం మార్పులు వస్తాయో వెళ్లు యింటికి అన్నట్లు యెక్కడ వుంటున్నావు?

చెప్పాడు

అయితే యీ వూళ్లో కాదన్నమాట? ఎప్పుడు వచ్చావు?

చెప్పాడు

పాత పరిచయస్థులను కలుసుకుందాం అని ఎంచలేదా యిన్నాళ్లూ? మరిచిపోయి వుంటావు



నీకేం లె

అలా నిష్ఠూరంగా మాట్లాడకు కౌసల్యా

నిజమాడితే నిష్ఠూరమని కదూ సామెత? అంది ఆమె ఉరుముతున్నట్లుగా చూస్తూ కాని ఆ దీనవదనం చూస్తే ఆమెకే యెంతో పరితాపం అయింది గొంతు మార్దవంగా మార్చి బాగున్నావా శాంతా? అంది

అబ్బ! ఎన్నాళ్లకు విన్నాడు ఆ పిలుపు!

శాంత! శాంత!

– నీది ఆడపేరు అందుకనే అలా పిలుస్తాను అనేది కౌసల్య తనకూ ముచ్చటగానే వుండేది –

శాంతా పిల్లలెంత మంది నీకు? భార్యాపిల్లల్ని తీసుకు రాలేదా? – యీమారు ఆమె గొంతు మరీ లలితంగా అనిపించింది

ఉహు ఆఫీసు పని మీద యేదో గొణిగాడు కౌసల్యా క్షమించు వెంటనే గుర్తు పట్టలేక పోయాను అన్నాడు కాస్సేపు ఆగి గొంతు తడిపొడిగా వుంది

పోనీలే యిప్పటికయినా గుర్తు వచ్చిందిగా!

యిక్కడున్నావేం కౌసల్యా ఇంకా సంగీతం సాధన చేస్తున్నావా? మానేశావా? నీ కచేరీలు ఎక్కడా వినడమే లేదు రేడియోలో రావడం లేదా? యేదో అడిగేశాడు కుతూహలం చంపుకోలేక

– సంగీతం మానేస్తానా? నా జీవం అది ఊపిరి ఆగినప్పుడే నా సంగీతం ఆగేది! – కౌసల్య యిదివరకు చెప్పిన మాటలు మదిలో మెదిలాయి ఎంత తెలివితక్కువగా మాట్లాడుతున్నాడు! నోరు మూసుక్కూర్చోవడం పెద్దమనిషి తరహా – యిటువంటి సందర్భాలలో

నిన్నగాక మొన్ననే రేడియోలో పాడాను గంటసేపు నువ్వు వూర్లో వుండి కూడా వినలేదన్నమాట! కిందపడి పొర్లాలనిపించింది కౌసల్య కాళ్ల మీద పడి యేడవాలనిపించింది

అప్పుడు అప్పుడు యేం జరిగింది?

ఎప్పుడో రేడియోలో విన్నాడు ఈ గొంతు పన్నెండేళ్ల క్రితం పరవశం అయినాడు ఆమెదే యెక్కడో కచేరీ వున్నదంటే యెవరో చెప్పగా విని – వెళ్లి ముందు వరసలో కూర్చున్నాడు

కౌసల్య హంసధ్వని ఆలాపన చేసింది జన్మతరించింది– అనుకున్నాడు

ఆమెతో పరిచయం చేసుకున్నాడు ఆ పరిచయం పెంచుకున్నాడు సంగీతం రాదు సాహిత్యం తెలియదు రసోత్పత్తి లేని – యీస్థటిక్ స్పిరిట్ లేని – గవర్నమెంటు ఆఫీసరు

కాని యెందుకనో సంగీతం అంటే మక్కువ యేర్పడిపోయింది చిన్నతనం నుంచి మంచి పాట మంచి పలుకు –యిట్టే పసిగట్టేస్తాడు

ఆ రోజుల్లో అనిపించేది – చక్కగా సంగీతం పాడే అమ్మాయిని కచేరీ సాంప్రదాయంలో మెరికలాంటి

# పర్వతగర్భం

మనిషిని ప్రేమించి పెళ్లి చేసుకుని ఆమెలో సంగీత జ్యోత ప్రకాశింప చేయాలని దేశానికో మంచి కళాకారిణి తయారయితే అందరూ తనను చూచి పలానా గాయకురాలి భర్త అంటూ వుంటే మ వారి ప్రోత్సాహం లేకపోతే నా సంగీతం యింత రాణింపుకు వచ్చేది కాదు అని ఆమె చెబుతూ వుంటే వింటూ గుండెలు నింపుకోవాలని ఉత్సాహంతో ఉల్లాసంతో ఊగి ఊగి పోవాలని అనిపించేది

అందుకనే అప్పుడు ఆమెతో పరిచయం పెంచుకున్నాడు ఆమె సంగీత కచేరీలకు విడిగా వెళ్లాడు ఆమెకు యెక్కువ ప్రాపకం ప్రాచుర్యం వచ్చేట్లు తనకు చేతనయినంతలో చేశాడు

శాంతా యెందుకు నేనంటే నీకు యింత మక్కువ? అని కౌసల్య అడిగితే ఏమని సమాధానం చెప్పాలో తెలిసేది కాదు

ఏమిటి ఆలోచనలో పడ్డావు యింటికి వెళ్లవా మరి? నేను దుకాణం కట్టెయ్యాలి అంది కౌసల్య

ఆమె యిక్కడ యెందుకు వుంది? – యిదే తపన అడగడం యెలాగో తెలియదు జవాబు మాత్రం కావాలి

చెప్పవేం కౌసల్యా నీ గురించి చెప్పవేం?

నా గురించి చెప్పడానికి యేముంది? అయినా నీకేం యింటరెస్ట్? సంగీతం వినడం మానివేసిన వాడివి కౌసల్యం వుంటే నీకేం లేకపోతే నీకేం?

మాటలతో చంపకు

ఎందుకు నన్ను కదిలిస్తావు వెళ్లు తరువాత యెప్పుడయినా పగలు రా మాట్లాడుకుందాం దుకాణం కట్టెయ్యాలి, ఆయన ఫ్యాక్టరీ నుంచి వస్తారు యింక

యీ దుకాణం మీదేనా?

ఆహా సాక్షాత్తు నాదే! బయట బోర్డ్ చూడలేదా? ఓహో ! చీకట్లో కనబడలేదేమో! అయినా మనుషులనే గుర్తుపట్టని వాడివి

అబ్బ కౌసల్యా దిగులు యెక్కువయి పోయింది

అప్పట్లో ఆమెకు చాల దగ్గరగా వచ్చేశాడు చూచేవాళ్లందరూ అనుమానించేంత దగ్గరకు వచ్చేశాడు

ఆమె కోసం రోజుకు అయిదారు గంటలయినా గడిపేవాడు ఆమెకు సౌకర్యాలు కలిగించడంలో సంగీత సాదనకు అనుకూల వాతావరణం యేర్పరచడంలో వళ్లు దాచుకోకుండా కృషి చేశాడు కళను ప్రోత్సహిస్తున్నాననీ పెంపొదిస్తున్నాననీ ఉద్ధరిస్తున్నాననీ మురిసి పోయేవాడు

ఒకరోజు యింక ఆలస్యం చేస్తే అమృతం కూడా విషం అయిపోతుందని భయం వేసి ఆమెతో ప్రత్యక్షంగా యీ ప్రస్తావన తీసుకు వచ్చాడు

ఏమంటావు? అన్నాడు

శాంతా నిజంగా పెళ్లి అవసరం అంటావా? నాకేమో యిలా సంగీత కచేరీలు చేసుకుంటూ నాదోపాసనలో జన్మ తరింప చేసుకోవాలని వుంది

'చాల్లే అమ్మమ్మ కబుర్లు చెప్పకు

మా అమ్మమ్మను నేను చూడలేదు శాంతా– ఈ జోక్ కు యిద్దరూ పడి పడి నవ్వుకున్నారు

జీవితంలో పెళ్లి అవసరం కౌసల్యా ఎవడినో ముక్కు ముఖం తెలియని వాడిని చేసుకుంటే వాడు నిన్ను సంగీత సాధన చేయనిస్తాడో లేదో కచేరీలకు వెళ్లనిస్తాడో లేదో కేవలం పడక గదిలో అలంకారప్రాయ మయిన వస్తువుగా వుండి పొమ్మంటాడేమో

కౌసల్య ముసిముసిగా నవ్వుతూ వుండిపోయింది

నిజం కౌసల్యా నీకు తెలీదు మగవాళ్లు నువ్వు అనుకున్నంత మంచివాళ్లు కాదు

ఆమె ఫకేలనవ్వేసింది

ఎందుకు నవ్వుతావు? నేను హితోపదేశం చేస్తుంటే నీకు నవ్వుతాలుగా వుందా?

ఆమె యింకాబిగ్గరగా నవ్వుతోంది

ఎందుకు ఎందుకు చెప్పు

మగవాళ్లని గురించి నీ సర్టిఫికేట్

అబద్ధం కాదు కౌసల్యా నీకు తెలీదు

ఆమె యింకా నవ్వుతూనే నువ్వు మగవాడివే అందుకు నవ్వు వస్తోంది అంది మనసులో ఉలిక్కిపడ్డాడు బెదిరినట్టుగా కనిపించకుండా నేను వేరు నేను వేరు నీకు తెలియదు అర్థంకాదు అన్నాడు ఎట్లా వేరో మాటలలో వివరించటానికి ప్రయత్నించాడు రక్షణలో ఎలా ఆమె గాన సరస్వతిగా ప్రపంచంలో ప్రకాశించటానికి వీలు అవుతుందో వివరించాడు ఆమె అంతా వోపికగా విన్నది

యేమంటావు?

యే విషయం?

అదే మన విషయం మన పెళ్లి విషయం

ఆమె యెన్ని మార్లయినా తిరిగి బయలుదేరిన చోటికే రావడం చికాకు అనిపించింది కర్ర విరగకుండా పాము చావకుండా చూద్దాంలే యిప్పుడేం తొందర అంటుంది

మరీ బలవంతం చేస్తే నువ్వు యేదో పరీక్షలకు చదువుకోవాలి అన్నావు గదా వివాహంతో విద్య నాశనం అయిపోతుందట అందుకని ముందు చదువు పూర్తిగానీ అంది అదీ పాయింటే– అనిపించింది

కర్మం చాలక – చాలి? – వారం రోజులయినా తిరగకుండా ఓ కొత్త సంగతి బయటపడింది. దానంతట అది చెవిలో పడింది

రేడియో స్టేషన్లో ఎవరో మాట్లాడు

కుంటున్నారు వరండాలో కూర్చుని కునికిపాట్లు పడుతున్న మనిషిని వాళ్ళు గమనించారో లేదో గాని:

కౌసల్య యింత చక్కగా పాడుతుంది గదా! అదేం చిత్త చాంచల్యం?

యేమయింది?

ఆ! ఆ మద్దెల శేషగిరి అంటే వొళ్ళు పయి తెలియకుండా ప్రవర్తిస్తుంది అయినా చక్కగా

శేషగిరి మద్దెల బాగా వాయిస్తాడు

గోడ అవతలి సంబాషణకు కుమిలిపోయాడు కౌసల్య అంటే అంతవరకు వుండిన అబిమానం ఆత్మీయత అన్నీ చెరిగిపోయాయి అదన్నమాట సంగతి! అందుకే యేదో మిష పెట్టి తమ పెళ్ళి వాయిదా వేసేస్తోంది ఎప్పటికప్పుడు కౌసల్య అమాయకురాలు కాదన్నమాట!

అమ్మదొంగా!

ఒక్కమాటుగా తలకాయ విదిలించి కొత్తగా వివేకం పొందిన మాదిరిగా వళ్ళంతా అపలించుకుని

గబగబ బయటకు వెళ్ళిపోయాడు

–అప్పటికి యిప్పుడూ కౌసల్యను చూడడం

ఆమె గాలి తన వయిపు వీచకుండా జాగ్రత్త పడ్డాడు అక్కడ నుంచి బదిలీ చేయించుకునే దాకా కౌసల్యతో మాట మాత్రమయినా చెప్పడం అవసరం అనిపించలేదు

అయితే పెళ్ళి చేసుకుని సుఖంగా వున్నావన్నమాట సంగీత సాదన వదలలేదు నేను కోరిందీ అదే న మాట నీవు వినలేదుగాని నేను కోరుకున్నట్లే చేస్తున్నావు సంతోషం అన్నాడు కౌసల్యతో యిప్పుడు ముఖంలోకి చూడడం లేదు గనుక ఆమె యీ మాటలకు యెంత అసహ్యించు కుంటూందో తెలిసి వచ్చే అవకాశం లేదు

చెప్పు కౌసల్యా మీ ఆయన నిన్ను బాగా చూచుకుంటున్నాడా?

పోన్లే యిప్పుడయినా పరామర్శ చేస్తున్నావు సంతోషం

క్షమించు కౌసల్యా

ఊరికే మాటలు మింగకు శాంతమూర్తీ ఇంకా నీకేం కావాలి? అదుగో, అటు చూడు రోడ్డుకు ఆ చివరగా వస్తూ యిటు క్రాస్ చేయాలని చూస్తున్న ఆయన్ను చూడు ఆయనే నా బర్త ఉండు వెళ్ళిపోకు పరిచయం చేస్తాను నువ్వే అడుగుదువుగాని అన్ని వివరాలూ!

– ఆ ఆసామీ దుకాణంలోనికి వచ్చేశాడు యింకా నిద్ర పోలేదా కుసూ–

ఊహు దుకాణం కట్టి వేద్దాం అనుకుంటూ వుండగా యిదుగో యీ శాంతమూర్తి వచ్చాడు మీకు చెప్పాను గదూ యిదివరకు అని అతని వయిపు తిరిగి మా వారు అంది గర్వంగా పెదిమలు దగ్గరకు తెచ్చుకుని

నమస్కారం కౌసల్య మిమ్మల్ని గురించి చెప్పింది సంగీతాన్ని నేను యెప్పుడు పొగిడినా మీ ప్రసక్తే తీసుకు వస్తుంది గ్లాడ్ టు మీట్ యూ సార్ – నా పేరు సుబ్రహ్మణ్యం అన్నాడు కౌసల్య మొగుడు

శాంతమూర్తి లాంచనప్రాయంగా ముఖమంతా నవ్వు పులుముకుని నమస్కారం నమస్కారం అన్నాడు

ఒక్క నిమిషం యిప్పుడే వస్తాను అని సుబ్రహ్మణ్యం యింట్లోకి వెళ్ళాడు కౌసల్య శాంతమూర్తి వంక దీక్షగా చూస్తోంది

అయితే నీవు శేషగిరిని చేసుకోలేద కౌసల్యా?

శేషగిరి? శేషగిరి ఎవరు? అంది కౌసల్య యింత దీరహం తీస్తూ

అదే మద్దెల వాయించేవాడే -అతను -రేడియో స్టేషన్లో

–కౌసల్య గుర్తు తెచ్చుకుందుకు ప్రయత్నిస్తూ ఓహో! అదా సంగతి అయితే శేషగిరి స్కాండల్ నీ దాకా వచ్చిందన్నమాట! అందుకనేనా నీవు మటుమాయం అయిపోయినావు? పోన్లే అదీ మంచికే అయింది– అంది

తల కొట్టేసినట్లు అయింది

ఎందుకట్లా బిడియ పడతావు? నేను వేరు– నేను వేరు– అని తెగ మురిపించేవాడివే నువ్వు యేం వేరు అయ్యావు? అందరితో పాటే అయి పోయినావు–

శాంతమూర్తి దిగులుగా ప్రశ్నార్థకంగా ఆమె వంక చూచాడు

ఇంకా వివరంగా చెప్పమంటావా? నేను మద్దెల వాయించే శేషగిరిని వివాహం చేసుకోలేదు శాంతా ఈ రొట్టె అంగడి సుబ్రహ్మణ్యాన్ని చేసుకున్నాను సరేనా యిప్పటికయినా నీకు సమాదానం అయిందా?

పాటలు పాడేవాళ్ళకు మద్దెల వాయించే వాళ్ళంటే యెక్కువ యిష్టం అని తనకు నూరిపోసింది యెవరు? యెవరు? గుర్తు తెచ్చుకుందుకు విఫలప్రయత్నం చేస్తున్నాడు

సుబ్రహ్మణ్యం లోపల నుంచి వచ్చి యేమండీ శాంతమూర్తిగారూ! ఎన్నాళ్ళకు మీ దర్శనం అయింది! మీ ఋణం తీర్చుకోలేనిదని మీకు యెప్పుడు చెబుదామా అని నాకు ఒకటే తహతహగా వుంది– అన్నాడు

వస్తానండీ– మళ్ళీ వస్తాను– అంటూ పర్వతగర్భం నుంచి బయటపడి దొర్లుతున్నంత వేగంగా రోడ్డు మీదకు జారాడు శాంతమూర్తి □

